# 7

# కాగితం పులి

**(కరీంనగర్‌లో 23-5-1983న జరిగిన రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు, నిర్బంధాల గురించిన కథనం)**

అదేదో సెట్టుకు గుద్దుకున్నట్టు ఏక్‌దమ్ బస్సు బ్రేక్ పడిపోయింది. మందంత ముంగటికి ఎనుకకై దెబ్బలు దాకినై. నిద్రవోతున్నోల్లు తేలుగుట్టినట్టు లేసిన్రు. కొందరేమొ అమ్మో అంటే కొందరేమో అయ్యో అన్నరు. ఇంక కొందరేమో "ఓరి దేవుడో" అని దెబ్బతాకిన కాడ చెయ్యితోటి రుద్దుకున్నారు.

బస్సు దేనికి గుద్దుకున్నదో సూద్దామని అందరు లేసిన్రు. బసు రోడు మీదనే ఉన్నది. ఎదురుంగ ఏదో జీపు ఉన్నది. అంటె దేనికి గుద్దుకోలేదన్నమాట అనుకొని తుర్తిగ ఉసూరుమన్నరు కొందరు. ఏదో ఒకటి చెకింగ్ పార్టీ అచ్చిందనుకున్నరు అందరు. అంతట్లనే బూట్లు తంతెల మీద టకటకమన్నయి. ముగ్గురు బస్సెక్కిన్రు.

ఇన్ల ఎవడెవడు కరీంనగర్ రైతుకూలి సంగం మీటింగులకు బోతాండు అనుకుంట లైనుకొద్ది టికట్లు చెక్ చేసుడు మొదలుబెట్టిండ్లు.

కరీంనగర్ టికెట్ ముందుగాల ఓ ముసలయ్య దగ్గర కనబడ్డది.

"అరె ముసులోడా! సావు యాల్లకు గివన్ని నీకెందుకురా!" అనుకుంట తిట్టింది పిస్తోలు.

"నా బిడ్డ దావుకాన్లున్నది సూడవోతన్న బాంచెన్" ఎగ్గిలోని తీర్గ కండ్లు, సీకిపోయి సినిగిపోతున్న పాత బొంత పీల్క తీర్గ పెయిమీద ముడతలు. బొగ్గు తీర్గ పెయి, అన్ల మాగిన అల్ల నేరేడుపండు తీరుగున్న ముసలయ్య అన్నడు.

"ఏవూరి కిచ్చినావురా నీ బిడ్డను?" అనుకుంట నెత్తిమీద రుమాలు గట్టిగవట్టి గుంజిండు. అది ఊసి చేతుల కచ్చింది. అదంత కాయవట్టున్నది. గంత మాసిపోయిందాన్ని గట్ల చేతుల వట్టుకోబుద్దిగాక అట్లనే కింద వారేసిండు.

ముసలోనికి కరెంట్ సాక్ గొట్టినట్లైంది. కొంచెం తమాయించుకొని ఏందో మాట్లాడవోయిండు.

కని అంతట్లనే పిస్తోలు మనిషి కోపం తోటి నెత్తి బూరువట్టి "ముసలి లం..కొడకా! సావుదలకొచ్చినవు, నకురాలు జేత్తున్నావురా? ఎవలు నేర్పిన్రురా నీకివన్ని, దిగు" అని తిట్టుకుంట కిందికి నూకేసిండు.

ముసలయ్య పడవోయి తమాయించుకొని కిందికి దిగిండు. అట్ల పదిహేను మందిని దించిన్రు. జేబుల్ల వున్న పైసలన్ని గుంజుకున్నరు.

ఆ బసు కరీంనగర్ ఎపుడో సేరేదుండె. బస్సుకూసి అయి రెండు గంటలు పండిలేసింది. ఎపుడో మబ్బులనంగ లేసి బయిలెల్లి అచ్చిన్రు ఆల్లు. ఆకలికి పేగులు గుర్ర గుర్ర మంటున్నాయి.

పిస్తోలు మనిషి బస్సుపోనీ అనంగనే బస్సు బుర్రుమన్నది. బస్సులున్నోల్లంత ఎనక్కి సూసుకుంటనే వొయిన్రు.

"బస్సు కిరాయిల మందమన్న పైసలియ్యుర్రి" ఎవలో అడిగిన్రు.

"అవ్, మీకు పైసలియ్యాల్రా పైసలు" ఎవలో అడిగిన్రు. మల్లోసారి సంగంల దిరుగమని అనే తీర్గసెయ్యాల" అంటూ పిస్తోలు మనిసి పైసలడినతనిని డొక్కల తన్నిండు. అందరిని బూతులు తిట్టుకుంట ఏడబట్టె ఆడకొట్టిండు.

"ఇగసక్కగ యింటి తొవ్వవట్టుర్రి. మల్లగనవడ్తె బొక్కలు సాపు జేస్తపోర్రి" అని బెదిరిచ్చింది పిస్తోలు.

"ఎండల నడిసిపోర్రి! సావుర్రి లం...కొడుకులార! మల్లోసారి సంగం అనకుంటగావాలె! గాండ్‌మె చటాక్ గోష్ నహీహై, విప్లవం తెత్తార్ర విప్లవం మీరు! గాడ్డి కొడుకుల్లారా! తన్నెటోడు లేక మదమెక్కింది" అంది ఇంకో పిస్తోలు.

గాపదైదు మంది మల్లమర్రి సూసుకుంట ఎనక తొవ్వ దొక్కినట్టు సేసి పక్కకు నడిసి ఓ సెట్టు నీడకు కూలవడ్డరు.

ఆల్లకు ఆకలంటె ఆకలైతాంది, దూపంటె దూపైతాంది. ఎండంటే ఎండ గాదు. పొయ్యిమీద తావు పెంక నెత్తిమీద బోర్లెసుకున్నట్టుంది ఎండ. పానం కొరి జీవునంల కచ్చినట్లైంది. గదె ముచ్చెట ఎవలో అన్నరు.

"గీ ముంగటేదో పల్లె తీర్గ గనవడ్తంది. పోయి ఏదన్నా అడుగుదాం పెడ్తె పెట్టిరి లేకపోతే లేదు. ఏం లేకపోతే ఆకరుకు మంచినీల్లె సై" అన్నరు ఇంకొల్లు.

ఎవరో ముసలయ్యను సూసుకుంట "వాపసు వోదామా! మీటింగు పోదామా! ఏం తాతా ఏంజేద్దాం" అని అడిగిన్రు.

"ఈడిదాకొచ్చి ఎనుకకుమర్లుడేందిరా? ఇంకెంత దూరముంటది?" అడిగిండు ముసలయ్య.

"నాలుగయిదు కోసులుంటది" అని ఎవరో అంటే "గింతేనా! పొద్దుగూకె టాల్లకు చేరకపోతమా? గిపుడంబె బస్సులచ్చినయిగాని ఎనుకట నడువలేదా? నడుద్దాం పాన్రి" అని అడుగు ముంగటి కేసిండు ముసలయ్య.

ఆపల్లె జేరి గిట్ల జరిగిందని జెప్పి, పెట్టింది మనిసికింత దిని కడుపునిండ నీల్లుతాగి నడుసుడు మొదలుపెట్టిన్రు.

ఓ గంట గడిసినంక ఏదో జీపు సప్పుడినవడ్డది. ఎటు వడితే అటు వురికిన్రు ఆల్లంతా. అది దాటిపోయినంక మల్ల ఎప్పటోలెనె. అట్ల ఎన్నోసార్లాయె.

ఆకలికి, ఎండకు, దూపకు ముసలితనానికి చక్కరచ్చి ముసలయ్య పడవోయిండు. కాల్లు పొక్కులచ్చి నడవత్తలేదు. పెయి ఎండకు సెమటకు వుప్పుదేలి అట్ట గట్టుకపోయింది. పెరండల్ల చేన్లల్ల వడి వురుకుతె ఎండు పుల్లలు సీర్క పోయినయి. అట్ల గీర్కపోయిన కాడ వుప్పు సెమట తాకి భగభగమండు తున్నయి. ఉప్పు సెమట కంట్లెవడి కారం బెట్టినట్లు మంట మండుతున్నయి.

ముసలయ్యకు దూపకు కడుపు కుట్టులేసింది. యిన్ని నీల్లు దాగిండు. ఉత్త కడుపుల నీల్లు పడేటాల్లకు చక్కరచ్చినట్టైంది. కడుపు నొప్పి మొదలైంది.

కొరిజీవునాలతోని కరీంనగరం జేరెటాల్లకు ఏడు ఏడున్నరయితాంది. సీకటైంది.

ఊరేగింపు నడుస్తాంది. నినాదాలిచ్చెటోల్లు యిస్తనేవున్నరు. అందరు అందుకొంటున్నరు. ఊరేగింపు ముంగట అచ్చం పల్లెల్ల ఊరేగింపు తీర్గ ముప్పయి ముప్పైయైదు ఎడ్లబండ్లు నడుస్తున్నయి. సంగం నాయకులు దేశంల వేరే కాన్నుంచి వచ్చిన స్వామి అగ్నివేశ్ వంటి నాయకులు, విప్లవ కళాకారులు ముంగటుండి వూరేగింపు నడిపిస్తున్నరు. అదిపెద్ద రోడ్లన్ని తిరుగుతాంది.

ఇది ఊరేగింపంటె ఊరేగింపు కాదు. అది ఎర్రనది... ఎర్ర ప్రవాహం. అది ఉరుకుతున్న జన జలపాతం.

కరీంనగరమంత ఎఱ్రవడ్డది. ఊరేగింపు ఆ కొసనుంచి ఈ కొస సూసెటాల్లకు గంట పొదువున్నది.

దాన్ని సూడంగనే ఆకలి మరిసిన ఉత్సాహం గంగ తీర్గ పొంగచ్చింది. ముసలయ్య, ఆల్లు వూరేగింపులో కల్సిపోయిన్రు. అందర్తోటి గల్సి రైతుకూలి సంగం వర్ధిల్లాలని, విప్లవం వర్ధిల్లాలని వురుములురిసినట్టు, మెరుపులు మెరిసినట్టుగా నినాదాలిస్తున్నారు.

ఊరేగింపు సభ జరిగే కాడికి జేరింది. ముసలయ్యకు ఆకలికి చక్కరచ్చి, కాల్లకింద భూమి కదిలినట్టయింది. ఇంత కడుపుల ఆసరవడితే మంచుగుండు అనుకున్నడు. ఏర్పాటునోల్లు ఎవలన్న కనబడ్తరేమొ అటుఇటు సూసిండు. నిలవడ్డోల్లందర్ని కూసుండ వెట్టుకుంట అల్లవూరి పిలగాడు అటె వత్తుండు.

"రాజా" అని ఎంతో గట్టిగ పిలసినాననుకొని పిల్సిండు. గుట్టవుతలి కెల్లి గుట్టివతలికి యిన పడ్డట్టు మెల్లగచ్చింది మాట తనది తనకె.

ఎట్లైతేంది యిటు మఱ్ఱి సూసిండు రాజయ్య.

సంబురంగ "అగో" ఎపుడచ్చినవె. నిన్ను మొన్ననే రమ్మంటి గదనె." అని అడిగిండు.

"నీకోసం నిన్నట్నుంచి సూసేది సూత్తన్న కనబడ్తలేవు. పోలీసులు గిట్ట పట్టకపోయిరా ఏందని భయపడ్తున్న! నువ్వు ఆకరికి నిన్ననే అచ్చేదుండెనే. అబ్బ ఏం సభలనుకున్నవె. అబ్బ! పన్నెండు వేలమంది ప్రతినిధులచ్చిన్రు. పందిరిసాల లేదే కూసుండుటానికి. సాలకపోతే వరంగల్నుంచి పట్నంనుంచి తెప్పిచ్చిన్రు టెంటులు. గింతమందికి రెండుసార్ల అన్నం బెట్టిండు. అందరు లైనుగట్టి తినడం ఎట్లుందో సూసి తీరాల్నే చెప్ప వశంగాదు. మా అసాంటోల్లు వెయ్యిమందిమి పని జేత్తన్నం..." అని యింకా ఏదో సెప్తనే ఉన్నడు.

ఆకలైతాందని జరిగింది చెప్పాడు ముసలయ్య.

"గట్లయిందా. మరి అడిగివస్త. అన్నం బెడతరో లేదో" అని కదలబోయిండు.

ఎవరో మైకులకెల్లి "అందరు నిశ్శబ్దంగా కూర్చోవాలి. ఈ సభ అయిపోయే దాక ఎవరికీ తిండి పెట్టకూడదు" అని అంటున్నరు.

అది గూడ నిజమే. గింతమందిల తిండిపెట్టుడు శురువు జేస్తే అంత గడబిడ అయితది అనుకొని ఎందుకు తియ్యిరా అని ముసలయ్య వద్దన్నడు. అట్లనే కూలవడ్డడు. మల్ల గలుస్త అనుకుంట రాజయ్య ఎల్లిపోయిండు.

ఎవలో ఉపన్యాసం ఇత్తున్నరు.

"ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అపూర్వ సంఘటన. అడుగడుగున తీవ్ర నిర్బంధాన్ని తప్పించుకుంటూ, ఎదిరిస్తూ నలుమూలల నుండి చేరింది విప్లవ ప్రజానీకం, మనవారిని ఎంతోమందిని నిర్బందించిన్రు. పెద్దపల్లిలో డెబ్బైమందిని అరెస్టు చేసిన్రు. అక్కడ సభలకు వచ్చేటోల్లను రాకుంట జేసుకోటానికి 144 సెక్షన్ పెట్టిన్రు. కాజీపేటల 700 మందిని ఆపేసిన్రు. కరీంనగర్ వచ్చే ప్రతి బస్సును సోదా చేసిన్రు. దించేసిన్రు. ఈ సభకు వస్తున్నోల్లను తన్నింన్రు, కొట్టిన్రు. ఎంతోమంది ఇప్పటికి లాకప్పుల్నే వున్నరు. ఎన్ని జెయ్యాలో అన్ని జేసిన్రు. అయినా అన్నిటినీ అధిగమించి ఇంతమంది సభకు రాగలిగిన్రంటనే మన పోరాట శక్తి తెలుస్తోంది...." ఇంకా గంభీరంగా ఏదో చెప్పుకపోతనే వున్నడు.

ఈల్లంత తన తీర్గనే ఎన్నో పుల్లెందుల వడి వచ్చిన్రనే భావం రాంగనే ఈల్లంత తనవాల్లెనని చెప్పరాని సంతోషం తోటి ఉక్కిరిబిక్కిరైపోయిండు ముసలయ్య. పాతకష్టాలు సుఖాలు యాదికి వచ్చి కండ్లల నీల్లు నిలిసినై.

గింత పోలీసు జులుం నడుమ గింత పెద్ద సభనా అని ముసలయ్య ఆశ్చర్యపోయిండు.

గోసిగాల్లు, గొంగడి బొంతగాల్లు, పెయిమీద అంగిలేనోల్లు, గీల్లేం విప్లవకారులని ముందుగాల ఎక్కిరించినోల్లంత వార్నీ అని ముక్కుమీద ఏలేసుకున్నరు.

విజయవాడల తెలుగుదేశం మీటింగుకు వచ్చినోల్లందరిని గిట్ల పోలీసులు తన్నుకుంట జేర్తె ఎంతమంది మిగిలెటోల్లో తెలవది గని ఈ నిర్బంధాలే లేకపోతే ఇంకెంతమంది కరీంనగర్ అచ్చెటోల్లో.

**అరుణతార / రాడికల్ మార్చ్, 1983.**